సాక్షి
పల్నాడు
శుక్రవారం । 25 । జూలై । 2025



అమ్మవారికి జలాభిషేకం

గురజాల రూరల్: వర్షాలు సమృద్ధిగా కుర వాలని మండలంలోని గంగవరంలో వేంచేసి యున్న శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి భక్తులు గురువారం జలాభిషేకం చేశారు.



నాభిశిలకు విశేష పూజలు

శావల్యాపురం: ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా శావల్యాపురం పెదకాపు వీధిలో వేంచేసియున్న శీతల పరమేశ్వరి అమ్మవారు (నాభిశిల)కి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గంగానమ్మ తల్లికి ఆషాఢ సారె

గుండవరం(చేబ్రోలు): మండలంలోని గుండవరంలో గురువారం గ్రామదేవత గంగానమ్మకు ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా గ్రామస్తులు పూజలు చేసి, సారెను సమర్పించారు.

కంప్యూటర్ సైన్స్‌కు జై

- బ్రాంచ్‌ల ఎంపికలో మొదటి ప్రాధాన్యత సీఎస్‌ఈకే..
- పూర్తయిన ఏపీఈఏపీ సెట్-2025 మొదటి దశ సీట్ల కేటాయింపు
- ఇంజినీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్, అనుబంధ బ్రాంచ్‌లలో పూర్తిస్థాయిలో భర్తీ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 36 కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 30,240 సీట్లు
- వీటిలో 90 శాతం మేరకు భర్తీ
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ కోర్సులకు విపరీతమైన డిమాండ్
- కళాశాలల్లో చేరేందుకు రేపటి వరకు గడువు ఇచ్చిన ఉన్నత విద్యామండలి



ఏపీ ఈఏపీసెట్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. మేలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్-2025)ను ప్రభుత్వం నిర్వహించింది. ఇందులో అర్హత సాధించి, వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఎస్సీహెచ్‌ఈ) సీట్లను కేటాయించింది. ముందుగా విడుదల చేసి షెడ్యూల్ ప్రకారం మంగళవారమే కేటాయింపు జరగాల్సి ఉండగా, ఒకరోజు ఆలస్యంగా బుధవారం సాయంత్రం సీట్ అలాట్‌మెంట్ జరిపింది.

తొలి ప్రాధాన్యం కంప్యూటర్ సైన్స్

సీట్ల కేటాయింపులో కంప్యూటర్ సైన్స్ కోర్సులకు అధిక డిమాండ్ నెలకొంది. సీఎస్‌ఈతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్‌డేటా, ఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల వారీగా విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదు సమయంలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. సీఎస్‌ఈ తరువాత ఐటీ, ఈసీఈ, మెకానికల్, ఈఈఈ బ్రాంచ్‌లను ఎంపిక చేసుకున్నారు.

90 శాతం సీట్లు భర్తీ

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 36 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో అంటుబాటులో ఉన్న 30,240 సీట్లలో 90శాతం మేరకు భర్తీ అయ్యాయి. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతో పాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలు, అగ్రశ్రేణి ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎస్‌ఈతో పాటు అనుబంధ విభాగాల్లో సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి. మిగిలిన 10 శాతం సీట్లలో సీఎస్‌ఈ మినహా వివిధ బ్రాంచ్‌లలో ఉన్నాయి.

ఆగస్టు 4 నుంచి తరగతులు

కళాశాలల్లో చేరేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి శనివారం వరకు గడువు విధించింది. ఏపీ ఈఏపీసెట్-2025 సైట్ నుంచి అలాట్‌మెంట్ ఆర్డర్, సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టును డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులు సంబంధిత కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంది. ఆగస్టు 4వ తేదీ నుంచి బీటెక్ ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఇక.. రెండు పూటల హాజరు

- మస్టర్ల ఆధారంగానే ఉపాధి కూలీలకు వేతనాలు
- పని ప్రదేశంలో కూలీలు ఉండాల్సిందే



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబు కార్డు కలిగిన శ్రామికులకు ఇకపై రెండు పూటలు హాజరు నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం ఉపాధి శ్రామికుల చిత్రాలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆయా మస్టర్ల ఆధారంగానే కూలీలకు వేతనాలు చెల్లిస్తారు. ఉపాధి హామీ పనుల హాజరులో జరుగుతున్న అవకతవకలను నివారించేందుకు, పనులు పారదర్శకంగా జరిగే విధానంపై పర్యవేక్షణే లక్ష్యంగా కేంద్రం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు క్షేత్ర సహాయకులు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) ద్వారా ఉదయం, మధ్యాహ్నం చిత్రాలు తీసి అప్‌లోడ్ చేసేవారు. ఈ విధానంలో కూలీలు రెండు పూటలా పని చేసినట్లు నమోదు చేసుకునే వారు. దీంతో సామాజిక ఆడిట్లు జరిగినప్పుడు హాజరులో లోపాలు ఉండటంతో క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించేవారు. కొత్త విధానంలో ఉదయం, సాయంత్రం హాజరు చిత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉన్న నేపథ్యంలో తప్పనిసరిగా కూలీలు పని ప్రదేశంలో ఉండాల్సి వస్తుంది.

నూతన విధానంలో ఇలా...

నూతన విధానంలో పనిచేసే ప్రదేశంలో ఉదయం తొమ్మిది గంటలకు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే చిత్రాలు తీయాలి. ఇలా తీసిన వాటినే రెండుసార్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిని పంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించి ఎంపీడీఓలకు నివేదిక పంపుతారు. ఇవి సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది ఎంపీడీఓలు తనిఖీ చేస్తారు. యాప్ ద్వారా శ్రామికులు రెండు సార్లు మస్టర్లు వేసేలా వారు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో సరిపడా వరి విత్తనాలు

జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు



నర్సింగపాడులో వరి నారుమడిని పరిశీలిస్తున్న డీఏఓ ఎం.జగ్గారావు, ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు: డిమాండ్‌కు సరిపడా వరి విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు తెలిపారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో బోర్లు, బావుల కింద సాగవుతున్న వరి నారు మడులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 39,079 హెక్టార్లలో వరిసాగు చేయనున్నట్లు తెలిపారు. బీపీటీ-5204, జేజీఎల్-384, కేఎన్‌ఎం-1638, అంకుర్‌పద్మ, అంకుర్‌సోనమ్, హెచ్‌ఎంటీ సోనం విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుసేవ కేంద్రాల ద్వారా పంట సాగుకు కావలసిన ఎరువులను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఎకరాకు 100-200కేజీల వర్మీకంపోస్టు వాడడం ద్వారా వరిపంటలో నాణ్యత పెరుగుతుందన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించి వర్మీకంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ కె.దేవదాసు, పంచాయతీ కార్యదర్శి కె.అప్పారావు, వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, ముస్తాక్, రైతులు జినుగు చంద్రశేఖర్‌రెడ్డి, కైపు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

రూ.7 లక్షల విలువైన బంగారం చోరీ

తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లిన మహిళా కండక్టర్ ఇంట్లో ఘటన

వినుకొండ: తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లిన ఓ మహిళ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన వినుకొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సన్నెగంటి విజయలక్ష్మి పట్టణంలోని సిద్ధార్థ్ నగర్‌లో నివాసం ఉంటోంది. భర్త మృతిచెందడం, పిల్లలు దూర ప్రాంతంలో ఉంటుండడంతో ఒంటరిగా ఉంటోంది. ఈక్రమంలో ఇంటికి తాళం వేసి ఈనెల 17వ తేదీన తీర్థయాత్రకని బంధువులతో కలిసి షిరిడీ వెళ్లింది. అయితే గురువారం ఇంటికి తిరిగి వచ్చి చూసిన ఆమెకు బీరువాలోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సుమారు రూ.7లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితురాలు తెలిపినట్లుగా పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబాల అభివృద్ధే లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: పేద కుటుంబాల అభివృద్ధే పీ-4 లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని దొండపాడు గ్రామంలో గురువారం పీ-4 సర్వే బంగారు కుటుంబాల పరిశీలన కోసం గ్రామ సభ నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే సచివాలయ సిబ్బంది పీ-4 సర్వే పూర్తిచేసి 139 బంగారు కుటుంబాలను గుర్తించారని తెలిపారు. ఈ జాబితాలో మార్పులు, చేర్పుల కోసం గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 64 వేల మందిని గుర్తించినట్టు వివరించారు. 2047 నాటికి ఒక్క కుటుంబం కూడా పేదరికంతో బాధపడకుండా చూడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ఉద్యోగులు, విదేశాలలో ఉండే వారిని సమన్వయపరిచి మార్గదర్శకులుగా ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సమాజంలోని పేదవారిని గుర్తించి వారికి ప్రభుత్వం అందిస్తున్న సాయంతో పాటు మార్గదర్శకుల నుంచి ఏదో ఒక సాయం అందించడం కార్యక్రమ ఉద్దేశ్యమని తెలిపారు. పేదరికం అనేది లేకుండా చేయడమే లక్ష్యంగా మార్గదర్శకులు పనిచేయాలని సూచించారు. ఆర్డీఓ మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్..

నరసరావుపేట: ఏపీ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ పి.అరుణ్‌బాబు కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. స్వర్ణ ఆంధ్ర, పీ-ఫోర్ ఫౌండేషన్, సానుకూల ప్రజా దృక్పథం, పట్టణాల్లో గ్యాస్ పంపిణీకి సంబంధించిన సమస్యలు, తదితర అంశాలపై జిల్లాలో నెలకొన్న పరిస్థితులను సీఎస్‌కు కలెక్టర్ వివరించారు.

తురకా కిషోర్‌పై మరో అక్రమ కేసు

బీసీ నాయకుడిపై కొనసాగుతున్న టీడీపీ కక్ష సాధింపు చర్యలు

మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులను రెడ్ బుక్ అమలు పేరుతో అక్రమ కేసులతో వేధిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం మాచర్ల రూరల్ పోలీసులు మరొక అక్రమ కేసుకు శ్రీకారం చుట్టారు. మండలంలోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన సంచుల నాగేశ్వరరావును 2023లో మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్ కత్తితో బెదిరించి టీడీపీలో తిరగటం మానుకోవాలని, బైకుపై ఉన్న స్టిక్కర్ తొలగించాలంటూ హత్యాయత్నానికి తెగబడ్డాడని నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన బీసీ నాయకుడు తురకా కిషోర్‌పై ఇప్పటికే ఎనిమిది కేసులు బనాయించి సుమారు 210 రోజులపాటు జైలు పాల్జేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. జైలు నుంచి బయటకు రాకుండా ఉండేందుకు కేసుల మీద కేసులు పెడుతున్న వైనంపై ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఒక కేసులో బెయిల్ వస్తుందనే సమయంలో మరొక అక్రమ కేసు నమోదు చేస్తూ వడ్డెర సామాజికవర్గానికి చెందిన నేతను మానసికంగా హింసిస్తున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇటువంటి కుట్రలను మానుకోవాలని బీసీ నాయకులు హితవు పలికారు.

నేడు అమ్మవారికి స్వర్ణ కవచాలంకారం



రాజ్యలక్ష్మి అమ్మవారి సన్నిధి

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఆగస్టు 22 వరకు శ్రావణ మాస ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసం మొదటి రోజు శుక్రవారం రాజ్యలక్ష్మి అమ్మవారికి స్వర్ణ కవచాలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నెల రోజుల పాటు భక్తుల కోసం హోమం, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

ఆలయ నిర్మాణానికి రూ.1.25 లక్షల విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెం మహంకాళీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన అన్నపూర్ణ అన్నదాన కమిటీ సభ్యులు రూ.1,25,000లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో గురువారం ఈఓ నలబోతు మాధవీలతను కలిసి విరాళం చెక్కును దాతలు అందించారు. మహంకాళీ అమ్మవారి ఆలయం, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నప్రసాదం సమర్పించే దాతలు ఈ విరాళం మొత్తాన్ని అందజేసినట్టు ఈఓ తెలిపారు.

కలెక్టర్ ఫొటోతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

ఎవరూ స్పందించవద్దన్న కలెక్టర్ కార్యాలయం



నరసరావుపేట: జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఫొటోతో కొందరు కేటుగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ సృష్టించి, ఆ అకౌంట్ నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టరేట్ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో స్పందించాయి. డీసీ పల్నాడు అంటూ నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేసి కొందరు డబ్బులు డిమాండ్ చేస్తూ సందేశాలు పంపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి ప్రలోభాలకు ఎవరూ లొంగవద్దని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

రేషన్ డీలర్లపై నివేదిక ఇవ్వండి

డీటీలను ఆదేశించిన జేసీ సూరజ్



నరసరావుపేట: జిల్లాలో రేషన్ పంపిణీ సమయంలో డీలర్లు కార్డుదారులతో దురుసుగా వ్యవహరిస్తున్న విషయంపై డిప్యూటీ తహసీల్దార్లు ప్రతి రేషన్‌షాపును తనిఖీచేసి సంబంధిత కార్డుదారులతో మాట్లాడి తగిన నివేదిక అందజేయాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కార్డుదారుల ఐవీఆర్‌ఎస్ కాల్స్, దీపం పథకంలో గ్యాస్ డెలివరీ బాయ్స్ చార్జీల రూపంలో అధికంగా వసూలు చేస్తుండడంపై డీటీలతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు వారి డెలివరీ బాయ్స్‌కు అదనంగా డబ్బులు వసూలుచేయకుండా ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో బీఫారం రద్దుచేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వీఎం ప్రసాదు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి శాకంబరి అలంకారం



నరసరావుపేట: పాలపాడు రోడ్డులోని శ్రీ చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా స్వామివారిని అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరి అలంకారం చేశారు. కదలిఫలం, అరటిపండ్లతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యోగా పోటీలకు మద్దిరాల జేఎన్‌వీలో సన్నాహాలు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: ఈనెల 29వ తేదీ నుంచి దక్షిణ భారతస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు గురువారం తెలిపారు. ఏటా జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ పోటీలకు తమ విద్యాలయం వేదిక కానుందని తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని జేఎన్‌వీ విద్యార్థులకు అండర్-14, అండర్-17, అండర్ -19 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 29,30,31 తేదీల్లో జరిగే పోటీలకు సౌత్‌జోన్ పరిధిలోని ఆయా విద్యాలయాల నుంచి సుమారు 340 మంది విద్యార్థులు ఈ యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జంగాల


జంగాల సింగరయ్య యాదవ్

దాచేపల్లి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దాచేపల్లికి చెందిన జంగాల సింగరయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాక వెంగళరావు యాదవ్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు సింగరయ్య యాదవ్ గురువారం తెలిపారు. రానున్న రోజుల్లో బీసీలను ఏకతాటిపైకి తీసుకొస్తానని, బీసీలకు సముచిత న్యాయం జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధి బీసీల అభ్యున్నతి ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని, రాష్ట్రంలోని బీసీలంతా వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసి బీసీలు అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సింగరయ్య యాదవ్‌ని పలువురు అభినందించారు.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

కనమర్లపూడి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం జాతీయ రహదారిపై ఈనెల 21న జరిగిన మినీ వాహనం, ఆటో ఢీకొన్న ఘటనలో మరొకరు మృతిచెందారు. ఘటనలో బత్తుల యశోదకుమారి (29) రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రగాయాలతో గుంటూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు శావల్యాపురం ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. గుంటూరులో మృతదేహానికి పంచనామా నిర్వహించి, అనంతరం బంధువులకు అప్పగించారు. ఘటనలో ఇప్పటికే నలుగురు దుర్మరణం చెందగా, యశోద కుమారి మృతితో మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

- సామాజిక సత్యాలను కవిత్వంతో మేళవించిన గొప్ప కవి
- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్


గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ తదితరులు

చిలకలూరిపేటటౌన్: బాల్యంపై ఉన్నం మమకారమే తనను బాల సాహిత్యకారుడిగా తీర్చిదిద్దిందని ప్రముఖ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కవికోకిల గుర్రం జాషువా వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సత్యాలను కవిత్వంతో మేళవించి, సమాజోద్ధరణకు పూనుకున్న గొప్ప కవి, నవయుగ కవిచక్రవర్తి జాషువా అని అభివర్ణించారు. సమాజంపై జాషువా విసిరిన కవిత్వం దళిత జాతిని జాగృతం చేసి అగ్రపీఠంపై నిలబెట్టిందన్నారు. తనకు సాహిత్య అకాడమీ అవార్డు తెచ్చిపెట్టిన 'కబుర్ల దేవత' పుస్తకంలోని విశేషాలను ఆయన వివరించారు.

■ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు అజయ్ బాబు మాట్లాడుతూ దళితుల ఆక్రందనలు, ఆకలి కేకలు కవి తీవ్రకరించి, అనాథలను, అభాగ్యులను కవితా వస్తువులుగా ఎన్నుకుని సమాజాన్ని ధిక్కరించిన కవిదిగ్గజం జాషువా అని కొనియాడారు. విశ్రాంత ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ జాషువా పద్యాలు హృద్యంగా ఆలపించారు. జాషువా వర్ధంతిపై విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయగా, సొసైటీ ప్రతినిధులు శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ముందుగా పట్టణ ప్రముఖులు తోట రామచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, సలహాదారులు న్యాయవాది దాసరి చిట్టిబాబు, దార్ల బుజ్జిబాబు, చుక్కా విన్సెంట్ పాల్, దారా కొండయ్య, బొప్పుడి వెంకటేశ్వర్లు, తంగెళ్ళ సుధాకర హరిప్రసాద్, జనక్రాంతి షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణం.. శుభప్రదం

నేటి నుంచి ప్రారంభం కానున్న నోముల మాసం


ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

సత్తెనపల్లి/యడ్లపాడు/గురజాల: సకల శుభాల శ్రావణమాసం ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుంది. శ్రావణ మాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకల నేపథ్యంలో ఆయా ఆలయాల్లో కమిటీలు ముమ్మర ఏర్పాటు చేస్తున్నాయి. ఈ మాసంలో ఇంటింటా శ్రావణ శోభ కనిపిస్తుంది. ఈ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారానికి ఓ విశిష్టత ఉంది. అందుచేత మహిళలు ఈ మాసాన్ని ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. నెల రోజులుగా ఆషాఢం కావడంతో ముహూర్తాలు లేవు. నేడు శ్రావణ మొదటి శుక్రవారం కావడంతో తమ ఇళ్లల్లో, ఆలయాల్లో శ్రావణ లక్ష్మికి పూజలు చేసేందుకు మహిళలు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

26 నుంచి మంచి ముహూర్తాలు...

నెలరోజులుగా ఉన్న ఆషాఢ మాసం ఈనెల 24 (గురువారం) తో ముగిసింది. శ్రావణమాసంలో ఈ నెల 26 నుంచి ఆగస్టు 22 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో వ్రతాలతో పాటు పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శుభకార్యాలకు మంచి రోజులు కావడంతో శుభకార్యాలు చేపట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. శ్రావణ మాసం మొదలైన మరుసటి రోజు నుంచి సుముహూర్తాలు మొదలు కానున్నాయి. ముఖ్యంగా ఈనెల 26, 30, 31, ఆగస్టు నెలలో1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17, సెప్టెంబర్ 23, 24, 26, 28, అక్టోబర్ 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31, నవంబర్1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27 తేదీల్లో సుముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో ఉన్న 15 మంచి ముహూర్తాల్లో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయని పురోహితులు చెబుతున్నారు. బాధ్రపద మాసం ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు ముహూర్తాలు లేవు.

అసమానతల నిర్మూలనకే జాషువా రచనలు

ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పీజీఎం కొండముది సుధీర్ బాబు


జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

తెనాలి: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సమాజంలోని అసమానతల తొలగింపు కోసం రచనలు చేశారని, తన సాహిత్యంతో సమాజ చైతన్యానికి కృషిచేశారని ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పీజీఎం కొండముది సుధీర్ బాబు అన్నారు. ఆయన సాహిత్యాన్ని ముందు తరాలకు అందించటానికి తగిన కృషి జరగాలని అభిప్రాయపడ్డారు.పట్టణానికి చెందిన గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 54వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర్లోని విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి సమితి ప్రధాన కార్యదర్శి, యునెస్కో అవార్డు గ్రహీత పినపాటి రవికుమార్ అధ్యక్షత వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి మాట్లాడుతూ జాషువా సాహిత్యం ఆనాటి కాలంలో సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చిందని తెలిపారు. అంటరానితనాన్ని పారద్రోలడంలో కీలక భూమిక పోషించిందని చెప్పారు. జాషువా కారణజన్ముడని ఆయన పేర్కొన్నారు. దళిత వర్గాల్లో పుట్టిన జాషువా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం రచనలు చేసి విశ్వక్ కవిగా ఖ్యాతిగాంచిన తీరు గొప్పదని ప్రశంసించారు. సమితి ఉపాధ్యక్షుడు వేజండ్ల రత్నం, కొండముది రమేష్, న్యాయవాదులు ఇందుపల్లి రాజారామ్, ఆరుమళ్ల శ్రీనివాసరావు, బొబ్బిలిపాటి ప్రసాద్, వేజండ్ల శ్రీనివాస్, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు గరికపాటి సుబ్బారావు, కళాకారులు, రచయితలు అయినాల మల్లేశ్వరరావు, అబ్దుల్ హకీం జాని, చోడవరపు భాస్కరరావు, ఆర్ అండ్ బీ రాజు, వేజెండ్ల శ్రీనివాసరావు, రావూరి ప్రేమ్‌కుమార్, జయరావు, అత్తోట శ్యామ్, సిద్ధల కమలాకర్ రావు, కనపర్తి డేవిడ్, విన్సెంట్ కుమార్, శ్రీనివాసరావు, పి. అశోక్ కుమార్, రావూరి బాల రాజ్ పాల్గొన్నారు. తొలుత జాషువా విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

కారు బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- అందుబాటులో లేని 108 వాహనం
- క్షతగాత్రులను ఆటోలో ఆస్పత్రికి తరలింపు

వినుకొండ: అతివేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా భార్యభర్తలతో పాటు మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన వినుకొండ నరసరావుపేట రోడ్డులోని రజకకాలనీ సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరానికి చెందిన జయరాం, తన భార్య లక్ష్మి, కుమార్తెలు సంఘవి, జాహ్నవిలతో కలిసి గుంటూరు నుంచి ప్రకాశం జిల్లా గజ్జలకొండకు కారులో వెళుతుండగా కారు ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఈక్రమంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న తలతోటి మల్లోల్కర్జున అనే వ్యక్తిని కారు బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడితో పాటు జయరాం, లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు.

ప్రాణదాత ఎక్కడ?

ప్రమాద సమాచారం అందిన వెంటనే నిమిషాల వ్యవధిలో ఘటనా ప్రాంతానికి చేరుకోవాల్సిన 108 వాహనం ఎంత సేపటికీ ఘటనాప్రాంతానికి చేరుకోలేదు. దీంతో గత్యంతరం లేక స్థానికులు క్షతగాత్రులను ఆటోలో గుంటూరుకు తరలించారు. ఆపద సమయంలో రాలేనప్పుడు ఇక 108 వాహనం ఎందుకని బాధితుల బంధువులు ప్రశ్నించారు.

ప్రభుత్వ సహకారం పొందే సంస్థలు, శాఖలకు
ఆర్టీఐ చట్టం వర్తిస్తుంది

జిల్లా సహకార అధికారి నాగరాజు


మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి

నరసరావుపేట: ప్రభుత్వ సహకారం, సహాయం పొందుతున్న అన్ని సంస్థలు, శాఖా కార్యాలయాలకు సమాచార హక్కు చట్టం వర్తిస్తుందని జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు పేర్కొన్నారు. గురువారం ప్రకాష్ నగర్‌లోని జిల్లా సహకార బ్యాంక్ సమావేశం హాలులో సమాచార హక్కు-2005పై అవగాహన సదస్సును ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది, ప్రాథమిక సహకార సంఘాల సీఈఓలకి సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 1964 ఏపీ సీఎస్ చట్టం కింద రిజిస్టరైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఆర్‌టీఐ పరిధిలోకి వస్తాయని అన్నారు.

■ డివిజనల్ సహకార అధికారి కె.తిరుపతయ్య మాట్లాడుతూ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి, సమాచార కమిషనర్ అధికార పరిధి, విధి విధానాలను, సమాచార విషయాల గురించి వివరించారు. సమాచార హక్కు ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రమని అధికారులు, పౌరులు పరస్పరం బాధ్యతాయుతంగా పారదర్శకంగా వ్యవహరిస్తూ చట్టాన్ని దుర్వినియోగం కాకుండా ప్రజాఅవసరాలకు ఉపయోగించుకోవాలని అన్నారు.

■ విజయవాడ కో-ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ కో-ఆర్డినేటర్ రంగరాజు, ఎస్‌డీఎల్ సీఓ రామిరెడ్డి, డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీస్ సూపరింటెండెంట్ జీపీడీ టాండన్‌లు మాట్లాడారు. జీడీసీసీ బ్యాంకు నరసరావుపేట బ్రాంచ్, సహకార శాఖ పల్నాడు జిల్లా కార్యాలయం, డివిజనల్ కో-ఆపరేటివ్ కార్యాలయ, సబ్ డివిజనల్ కార్యాలయ సిబ్బంది, నరసరావుపేట తాలూకాలోని 18 పీఏసీఎస్‌ల సీఈఓలు పాల్గొన్నారు.



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 773

కొమ్ములు : 600 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,200	10,711	10,200

కాయలు : 173 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,200	10,725	10,250

మొత్తం అమ్మకాలు : 579.750 క్వింటాళ్లు

-దుగ్గిరాల

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు


సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం వల్ల వేలాది కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర మహాసభలు రెండో రోజు శుక్రవారం పాత గుంటూరులోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూయ, రమణరావు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీలోపు సంక్షేమ బోర్డు పని చేయడం ప్రారంభించాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 15న లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద సామూహిక ధర్నా చేస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు మాట్లాడారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రమణరావు, ఆర్.వి. నరసింహారావు, కోశాధికారిగా గోపాలరావు, ఉపాధ్యక్షులుగా అనసూయ, రాజ్‌గోపాల్, సహాయ కార్యదర్శులుగా సుందరబాబు, అప్పారావు, 17 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గాన్ని, 63 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,733
అమ్మకాలు	45,884
నిల్వ	8,071

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,500
నంబరు-5	10,000-13,500
341	10,000-13,600
4884	10,000-12,700

అడ్మిషన్ల పెంపునకు కృషి చేయండి

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర కో-ఆర్డినేటర్ పి.రవీంద్రనాథ్


ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యా పీఠం రాష్ట్ర, జిల్లా కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల పెంపునకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఏపీఓపెన్ స్కూల్‌సొసైటీ) రాష్ట్ర కో-ఆర్డినేటర్ పి.రవీంద్రనాథ్ సూచించారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరగాలన్నారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సౌకర్యాలను అందించాలన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరావు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ నెల 30వ తేదీ నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు అపరాధ రుసుం రూ.200 చెల్లించి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440004297, 8522994297 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు క్లెయిమ్‌లపై విచారణ

ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: చీరాల అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు క్లెయిమ్‌లపై బీఎల్‌వోలతో సమర్థంగా విచారణ నిర్వహిస్తున్నామని ఈఆర్‌వో, ఆర్డీవో తూమాటి చంద్రశేఖరనాయుడు తెలిపారు. గురువారం చీరాల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయపార్టీల నాయకులతో ఓటరు క్లెయిమ్‌లపై విచారణ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో ఓటరు క్లెయిమ్ అర్జీలు పెండింగ్‌లో లేకుండా విచారణ చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు తమ బూత్ ఏజెంట్లతో విచారణ చేయించుకోవచ్చన్నారు. క్లెయిమ్ అర్జీని నిశితంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అవాంతరాలు లేకుండా విచారణ చేస్తున్నారని, ఏమైనా అభ్యంతరాలుంటే వివరాలను తెలియజేయాలన్నారు. ఇటీవల మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లోని ఓటర్ల పూర్తి వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈసీ నిబంధనల ప్రకారం విచారణ చేయాలని, ఇష్టానుసారంగా విధులు నిర్వహించవద్దనే ఆదేశాలు జారీ చేశామన్నారు. సమస్యలను తనకు గానీ, ఏఈఆర్వోలకు గాని తెలియజేయాలని కోరారు. రాజకీయపార్టీల నాయకులకు ఉన్న పలు అనుమానాలను ఆర్డీఓ నివృత్తి చేశారు. తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీటీ సుశీల, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


కొండమంజులూరులో ఆక్రమించిన డొంక పోరంబోకు భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరం

జె.పంగులూరు: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు హెచ్చరించారు. మండల పరిధిలోని కొండమంజులూరు జాతీయ రహదారి వెంబడి గత సర్వే నెంబర్ 58లో ఆక్రమణకు గురైన డొంక పోరంబోకును ఆర్డీఓ గురువారం పరిశీలించారు. 58 సర్వే నెంబర్‌లో మొత్తం 2.47 ఎకరాలు డొంక పోరంబోకు ఉన్నట్లు అధికారులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆక్రమణకు గురైన డొంక పోరంబోకు స్థలాన్ని గుర్తించి, ఆక్రమించిన వారిని గుర్తించి సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం పంచాయతీ, రెవెన్యూ అధికారులు.. ఆక్రమించిన వారికి నోటీసులు పంపించి స్థలం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కొండమంజులూరు గ్రామానికి అనుకొని ఉన్న మట్టి దిబ్బను పరిశీలించారు. అక్రమ మట్టి తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూర్పు కొప్పెరపాడులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 14 వేల టన్నుల పొగాకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సింగారావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో స్వల్ప వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆరు మండలాల్లో స్వల్ప వర్షం పడింది. దుగ్గిరాల మండలంలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా 8.6 మిల్లీమీటర్లు పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 2.6 మి.మీ. పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి మండలంలో 8.4 మి.మీ., తాడేపల్లి 3.6, చేబ్రోలు 3.2, తుళ్లూరు 2.8, తాడికొండ మండలంలో 2.6 మి.మీ. చొప్పున వర్షం పడింది.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ గ్రామాన ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు సూచించారు. రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు(ఏఏ), ఉద్యాన సహాయకులు(వీహెచ్‌ఏ)లకు కృషీ భవన్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ జూమ్ మీటింగ్ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమైన తొమ్మిది సార్వత్రిక సూత్రాలు, సాగు పద్ధతులు, రైతులు పొందిన ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని కోరారు. అన్ని రంగాలు ఒకే బాటలో పని చేయాలని, ముఖ్యంగా అది ప్రకృతి వ్యవసాయమై ఉండాలని ఆయన తెలిపారు. రసాయనాలు వాడకం తగ్గించి, సహజ జీవన ఉత్ప్రేరకాలు ఉపయోగిస్తే భూమికి కలిగే ప్రయోజనాలను రైతులందరికీ తెలియజేయాలని సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా భూమి ఆరోగ్యంతో పాటు అందరి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ రైతులు సాధించిన ఫలితాలను ప్రకతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి వివరించారు. ఇప్పటి వరకు 80 గ్రామ పంచాయతీలు మాత్రమే ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఉన్నాయన్నారు. అయితే, ఇప్పుడు నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ ప్రోగ్రాం ద్వారా 233 గ్రామ పంచాయతీలు భాగమవడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అంతా కలిసి రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా కార్యక్రమాలను నిర్వహించాలని ఆమె సూచించారు.ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను గుంటూరు ఏడీఏ మోహనరావు, జిల్లా యాంకర్ గోపీచంద్ వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

ఆర్.సి.నెం :1757/2025/ఇ1 | పిటీ నెం.24/జె.టి.ఓ./2025-26 | తే.24-07-2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు ప్రకటన

[illegible]

మొత్తము పనులు : 44 | అంచనా వ్యయము :రూ.323.94లక్షలు

పని నెం: 01 నుండి 44 వరకు:	
1.టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది పని నెం: 39, 41, 42 మరియు 43 లకు	తే.25.07.2025 ఉదయము గం.11.00ల నుండి
2.టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	తే.28.07.2025 ఉదయము గం.11.00ల వరకు
3.ప్రైస్‌బిడ్ తెరుచు తేది పని నెం:04, 05, 06, 07, 08, 28, 30, 35, 39 మరియు 40లకు	తే.29.07.2025 మధ్యాహ్నము గం.02.00ల లకు
4.టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	తే.02.08.2025 ఉదయము గం.11.00ల వరకు
5.ప్రైస్‌బిడ్ తెరుచు తేది పని నెం: 01,02,03,09, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 29, 31, 32, 34, 36, 37, 38, మరియు 44 లకు	తే.05.08.2025 మధ్యాహ్నము గం.02.00ల లకు
6.టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	తే 11.08.2025 ఉదయము గం.11.00ల వరకు
7.ప్రైస్ బిడ్ తెరుచు తేది	తే 11.08.2025 మధ్యాహ్నము గం.02.00ల లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

కమీషనర్, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్క్రాప్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్క్రాప్‌క్యాష్) సంప్ర॥ 87907 41166

WANTED

■ నల్లపాడు, కైలాసగిరి వద్ద వైభవ్ ఇండస్ట్రీస్ వారి ప్యాకేజ్డ్ & డ్రింకింగ్ వాటర్ బాటిల్స్ సప్లై చేయుటకు 2 వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9441912776, 7702747988

■ మా సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లేడీస్ కావలెను. 10th పాస్/ఫెయిల్ to PG ఫోన్ : 73807 11162, 73864 85982

■ షాప్‌లో పనిచేయుటకు గుమస్తాలు మరియు ముఠావాళ్ళు కావలెను. గుంటూరు సిటీ లోకల్ వారు మాత్రమే సంప్రదించగలరు. సెల్ : 8142842888, 7995270181

■ గుంటూరు, ఒంగోలులో గల కాలేజీ హాస్టల్ నందు పనిచేయుటకు లేడీ వార్డెన్స్ మరియు వంట చేయుటకు లేడీ హెల్పర్స్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్ 81224 61164, 70827 10968

■ Wanted Experienced Computer Accountant Should Know Hindi and English for Details Contact: 9160607468, 9441547482

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9963521122, 9963101122

■ తాడేపల్లి, కుంచనపల్లి, పాతూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 hrs. డ్యూటీ, జీతం : 12000, భోజనం సౌకర్యం. Q :10th,50సం.లోపు వారు.సంప్ర✆ 88014 97437

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167663 7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్లేషించుకుని ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.